క్లుప్తంగా

హజ్ యాత్రికులకు శిక్షణ

న్యూశాయంపేట : హజ్‌యాత్రకు వెళ్లే యాత్రికులకు హజ్ కమిటీ, సాధిక్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9న జనగామలో ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని అందించనున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా హజ్ కమిటీ అధ్యక్షుడు సర్వర్ మోహినొద్దీన్ ఘూజీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని హైదరాబాద్‌రోడ్ బిలాల్ మజీద్ దగ్గర ఉన్న విజయ ఫంక్షన్‌హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హజ్ కమిటీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ లియాఖత్ హుస్సేన్, జనగామ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొంటారన్నారు.

సీపీని కలిసిన అర్చకులు



హన్మకొండ కల్చరల్ : శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప దేవాలయం వ్యవస్థాపక నిర్వాహకులు టీఆర్ బాలసుబ్రమణ్యశర్మ, ఆలయ అర్చకులు గణపతిశర్మ మంగళవారం వరంగల్ సీపీ కార్యాలయంలో సీపీ అంబర్‌కిశోర్ ఝూను మర్యాదపూర్వకంగా కలిసి శేషవస్త్రాలు, ప్రసాదం అందించి ఆశీర్వచనం అందజేశారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



హన్మకొండ: నిరుపేద రెడ్డిల కోసం రెడ్డి కార్పొరేషన్, విదేశీ విద్యానిధి ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ పూర్తిస్థాయిలో అమలు చేయాలని రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో సీఎం స్పెషల్ సెక్రటరీ బి.అజిత్‌రెడ్డిని రెడ్డి సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. శాలువా కప్పి సన్మానించారు. రెడ్డిల హక్కుల సాధనకు గత కొన్నేళ్లుగా ఉద్యమాలు నడిచాయన్నారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు నవల సత్యనారాయణ రెడ్డి, చందుపట్ల సత్యనారాయణ, బదూరి వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

క్వారీ నిర్వహణకు ప్రజాభిప్రాయ సేకరణ

కాజీపేట అర్బన్ : మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 111లోని ఇంపీరియల్ గ్రానైట్స్ క్వారీ నిర్వహణకు మంగళవారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎన్వీరాన్మెంటల్ ఇంజనీర్ సునీత ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయాలను సేకరించారు. వారి వెంట హన్మకొండ ఏడీ మైన్స్ నర్సిరెడ్డి, కాజీపేట తహసీల్దార్ బావుసింగ్ ఉన్నారు.

నేడు మహిళా దినోత్సవం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ మహిళా అధ్యయన కేంద్రం, యాంటి సెక్సువల్ హరాస్‌మెంట్ సెల్ (వేదన) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 7న ఉదయం 10-30 గంటలకు సెనేట్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించనున్నామని కేయూ మహిళా అధ్యయన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.దీపాజ్యోతి, యాంటి సెక్సువల్ హరాస్‌మెంట్ సెల్ (వేదన) బాధ్యులు డాక్టర్ మేఘనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యఅతిథిగా కేయూ వీసీ రమేష్, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, విశ్రాంత తెలుగు విభాగం ఆచార్యులు కాత్యాయనీ విద్మహే పాల్గొని ప్రసంగిస్తారని వారు తెలిపారు.

20 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ ప్రోగ్రాం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ ఆధ్వర్యంలో ఆరు వారాల పాటు (40 రోజులు) స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రోగ్రాంను ఈనెల 20 నుంచి నిర్వహించనున్నామని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ సంచాలకులు డాక్టర్ మేఘనారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు రూ.1000 చొప్పున, ఇతరులకు రూ.1500లు చొప్పున ప్రిన్సిపాల్, యూనివర్సిటీ కాలేజ్ (నాన్ యూనివర్సిటీ ఫండ్)లో చెల్లించి తరగతులకు హాజరుకావాలన్నారు.

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన మహేష్

వరంగల్: 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అడుప మహేష్ మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. నామినేటెడ్ పదవి ఇప్పించాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్ మున్షీ ఆమెకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు, విక్టర్ తదితరులున్నారు.

ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

● వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్.నాగరాజు



ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

మడికొండ: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మహాశివరాత్రి ఉత్సవాలను నిర్వహించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కమిటీ సభ్యులకు, అధికారులకు సూచించారు. మంగళవారం శ్రీ మెట్టురామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా శివాలయంలో, రామాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలను నిర్వహించారు. అనంతరం పాలక మండలిచే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ ఆలయ కమిటీ సభ్యులు ఆలయ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఉత్సవాలను ఎలాంటి అటంకాలు లేకుండా చూడాలని అన్నారు. వీఐపీ(దర్శనం)పాసులను రద్దు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషభారతి, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పైడిపాల రఘుచందర్, డైరెక్టర్లు రాజు, శ్రీనివాసు, కేదారి, దయాకర్, ఉమ, అభిలాష్‌శర్మ, జ్ఞానేశ్వరీ, అమర్‌నాథ్, మోహన్, శంకర్, బైరి లింగమూర్తి పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన'తో భరోసా



మాట్లాడుతున్న ఆనంద్ గౌడ్

హన్మకొండ: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజనతో 18 కులాలకు, చేతివృత్తుల వారికి ప్రధాని మోదీ భరోసా కల్పించారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. మంగళవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ విశ్వకర్మ లబ్ధిదారులకు శిక్షణ ఇస్తూ నిపుణులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో రోజుకు రూ.500 చొప్పున అందిస్తున్నారని, శిక్షణ అనంతరం రూ.15 వేలు, టూల్ కిట్లతో పాటు తక్కువ వడ్డీకి ముద్ర రుణాలు ఇస్తారన్నారు. మహిళలకు కూడా నారీ శక్తి అభియాన్ ద్వారా డ్వాక్రా గ్రూపులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడం వంటి ప్రయోజనాలు కల్పిస్తున్న మోదీని మరోసారి ప్రధానిగా చేయాలన్నారు. బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ ప్రజలు మోదీ మూడోసారి ప్రధాన మంత్రి కావాలని కోరుకుంటున్నారన్నారు. సమావేశంలో నాయకులు నాంపల్లి శ్రీనివాస్, బెజ్జంకి పూర్ణాచారి, శ్రీనివాస్ యాదవ్, కృష్ణమాచారి, శ్రీనివాస్, సంపత్, తిలక్ పాల్గొన్నారు.

ఆర్థిక పరిపుష్టిలో సీఏలది కీలక పాత్ర

వరంగల్: చార్టెడ్ అకౌంటెంట్లు నవభారత నిర్మాణంలో, దేశ ఆర్థిక పరిపుష్టిలో కీలకపాత్ర పోషిస్తున్నారని, యువత సీఏ కోర్సులపై ఆసక్తి చూపడం అభినందనీయమని ప్రముఖ చార్టెర్డ్ అకౌంటెంట్, పూర్వ ఐకాయ్ జిల్లా అధ్యక్షుడు సీఏ పీవీ.నారాయణరావు అన్నారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా వజ్రోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి వరంగల్‌లో జరిగిన వరంగల్ బ్రాంచి నూతన కార్యవర్గ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నారాయణరావును ఆయన అసోసియేషన్ సేవలను పురస్కరించుకుని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గం, చార్టెడ్ అకౌంటెంట్లు పాల్గొన్నారు.

మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకుమార్

వరంగల్ చౌరస్తా : వ్యవసాయ ఉత్పత్తులకు ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టం తీసుకురావాలని రైతు సంఘాల నాయకులు, వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం వరంగల్ అబ్బనికుంటలోని తెలంగాణ రైతు సంఘం, ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'వ్యవసాయ ఉత్పతులకు ఇచ్చే మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి అంశం'పై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించటంతో పాటు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరగా గత 15 రోజులుగా ఢిల్లీలో రైతాంగం చేస్తున్న పోరాటానికి మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. రైతు సంఘాలు సంఘటితం కావాలని, గ్రామ, గ్రామాన రైతులకు అవగాహన కల్పించే 'రైతు జాత 'వరంగల్ జిల్లా నుంచి ప్రారంభించాలని సూచనలు చేశారు. ఈ సమావేశంలో రైతుల నుంచి నేరుగా వారి అభిప్రాయాలు స్వీకరించారు. అనంతరం ప్రధాన వక్తలు ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, వినాయకరెడ్డి, మరింగంటి యాదగిరాచార్యులు, నైనాల గోవర్ధన్ తమ అభిప్రాయాలను వ్యక్తపరిచారు. సమావేశంలో సోమా రామ్మూర్తి, ఓదెల రాజయ్య, ఊరటి హంసాల్ రెడ్డి, సిరుల రవీందర్, బుచ్చిరెడ్డి, జెండా అంబయ్య, ఎం. పీరయ్య, మోహన్‌రావు, రాజు, రాజేందర్, భాస్కర్, కిషన్‌రావు, ప్రసాద్ పాల్గొన్నారు.

పోర్ట్ ఫోలియో జడ్జిని కలిసిన నాయకులు



వరంగల్ లీగల్ : హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టుల పోర్ట్ ఫోలియో జడ్జి లక్ష్మణ్‌ను రెండు జిల్లాల బార్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈనెల 17న ఏసీబీ, సీనియర్ సివిల్ కోర్టు ప్రారంభోత్సవానికి వస్తున్న చీఫ్ జస్టిస్ అలోక్ ఆరాధే కార్యక్రమం గురించి చర్చించారు. కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి, ఆనంద్‌మోహన్, జనరల్ సెక్రటరీలు జి.శ్రీధర్‌రెడ్డి, యాకస్వామి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

7న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ధర్నా

ఎంజీఎం : నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 7న డీఎంహెచ్‌ఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ, ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో 33 జిల్లాల నుంచి ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరూ తప్పకుండా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఏబీవీపీ ఆందోళన

హసన్‌పర్తి: హనుమకొండ-కరీంనగర్ ప్రధాన రహదారి భీమారం సెంటర్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సందేశ్ ఖాళీ సంఘటనను నిరసిస్తూ టీఎంసీ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఏబీవీపీ హన్మకొండ కన్వీనర్ సుజిత్ మాట్లాడారు.

బాధిత కుటుంబానికి చేయూత

హసన్‌పర్తి: అనారోగ్యంతో మరణించిన భీమారానికి చెందిన ఆటోడ్రైవర్ రాజు కుటుంబాన్ని కాంగ్రెస్ నేతలు చేయూతనందించారు. ఈ మేరకు మంగళవారం బాధితుడి కుటుంబానికి బియ్యంతో పాటు నగదు అందించారు.

కాంగ్రెస్ మైనార్టీసెల్ అధ్యక్షుడిగా జలీల్

రామన్నపేట : నగరంలోని 29వ డివిజన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా అబ్దుల్ జలీల్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ సలీం పాషాను నియమిస్తూ టీపీసీసీ మైనార్టీ సెల్ చైర్మన్ షేక్ అబ్దుల్ అలీమ్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి నియామకంపై మైనార్టీ సోదరులు హర్షం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ కార్యకర్తపై హత్యాయత్నం...?

కాశిబుగ్గ: కాశిబుగ్గకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త, కొండా అభిమాని శ్రీరామోజు నాగరాజుపై కొంత మంది హత్యాయత్నానికి పాల్పడినట్లు వాట్సప్‌ల్లో ప్రచారం జరుగుతోంది. నాగరాజు కాంగ్రెస్‌లో ఆక్టివ్‌గా పని చేయడం ఇష్టంలేని కొందరు బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక ఐదుగురి నేతృత్వంలో సుమారు 10 మంది వరకు గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం నాగరాజు ఇంట్లోకి చొరబడి కట్టెలతో కొట్టారన్నారు. వెంట తెచ్చుకున్న కత్తితో నాగరాజును చంపే ప్రయత్నం చేశారని, అడ్డువచ్చిన వాళ్ల అమ్మపై కూడా చేయి చేసుకున్నారని, బయట ఉన్న తన బైక్‌ను పాక్షికంగా దహనం చేశారని బాధితుడు వాట్సప్ గ్రూపులో పెట్టినట్లు తెలిసింది. నాగరాజును స్నేహితులు ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

మడికొండ: మనస్తాపం చెంది ఉరి వేసుకొని వృద్ధుడు ఆత్మహత్యకు పాడిన సంఘటన టేకులగూడెం శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ధర్మసాగర్ మండలం ఉనికిచర్లకు చెందిన ఎల్లావుల ఆగయ్య(65) తనకు చెందిన వ్యవసాయ భూమి అమ్మకం విషయంలో ఆగయ్య చిన్న కోడలు స్వప్న భూమి అమ్మవద్దంటూ చెప్పడంతో ఆగయ్య తాను సంపాదించిన భూమి అమ్మవద్దు అంటున్నారని మనస్తాపం చెంది టేకులగూడెం శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ రాంచందర్ తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 6న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సప్తగిరి కాలనీ, ఆర్టీసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ

హన్మకొండ: జాతీయస్థాయి చిత్ర లేఖన పోటీల్లో హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. నలుగురు సరోజ గుప్త అవార్డులు, 54 మంది గోల్డ్ మెడల్స్, 107 మంది సిల్వర్ మెడల్స్, 124 మంది బ్రౌన్ మెడల్స్ సాధించారు. మంగళవారం మెడల్స్ సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ జి.మత్యాస్‌రెడ్డి, డైరెక్టర్ సునీతరెడ్డి అభినందించి మెడల్స్ అందజేశారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మడికొండ: 46వ డివిజన్ స్టేషన్ పెండ్యాలలో రోడ్డు పనులకు సైడ్ డ్రెయినేజీ పనులకు కార్పొరేటర్ సరోజన శంకుస్థాపన చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు

నేడు వాహనాల వేలం

కాజీపేట: కాజీపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్లు సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు వేలం వేయడం జరుగుతుందన్నారు.

ఒంటరి మహిళను చేరదీసిన సఖి సిబ్బంది

కాళోజీ సెంటర్ : నాలుగు రోజుల నుంచి వరంగల్ చౌరస్తాలో ఒంటరిగా ఉంటున్న మహిళను గుర్తించి సఖి సెంటర్‌కు స్థానిక మల్లారెడ్డి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా వెంటనే సిబ్బంది వెళ్లి చేరదీశారు. వెంటనే కానిస్టేబుల్ రాజ య్యను పంపి సదరు మహిళను మదర్‌థెరిస్సా హోమ్‌కి తీసుకవెళ్లి ఆశ్రయం కల్పించారు.

గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలి

నయీంనగర్: హనుమకొండలోని కుడా గ్రౌండ్‌లో గద్దర్ కళాక్షేత్రాన్ని నిర్మించాలని గద్దర్ ఆలోచన ఐక్యవేదిక కన్వీనర్ ఎం.ఎల్లయ్య కోరారు. తన పాటలతో లక్షలాది మంది ప్రజలను పోరాటంలో భాగస్వామ్యం చేసిన ఘనత గద్దర్‌ది అన్నారు.

కాంగ్రెస్‌లో చేరనున్న మాజీ సర్పంచ్‌లు

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగలనుంది. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధం చేశారు. సుబేదారిలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం చేరికలు ఉంటాయని, ఎమ్మెల్యే నాగరాజు సమక్షంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

కార్పొరేటర్ల చూపు?

వర్ధన్నపేట నియోజకవర్గంలోని పలువురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరడానికి రంగం సిద్ధమైనట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం 55, 56, 65 డివిజన్ల కార్పొరేటర్లు సమావేశమై పార్టీ మార్పుపై చర్చించుకున్నట్లు సమాచారం.

జేసీబీతో హద్దులు తొలగింపు

ఖిలా వరంగల్: వరంగల్ కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు ఖిలావరంగల్ మండలం పరిధిలో వెలిసిన అక్రమ నాన్ లే అవుట్ వెంచర్లపై రెవెన్యూశాఖ, జీడబ్ల్యూఎంసీ కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైంది. దూపకుంట, బొల్లికుంట, స్తంభంపెల్లి, గాడిపెల్లి, తిమ్మాపురం, మామునూరు, వసంతాపురం గ్రామాల్లో పదుల సంఖ్యలో అక్రమ వెంచర్లు వెలిశాయి. దూపకుంట రెవెన్యూ పరిధిలోని 1351, 1352 సర్వేనంబర్లలో ఏర్పాటు చేసిన నాన్ లే అవుట్ అక్రమంగా వెంచర్ వద్దకు మంగళవారం ఉదయాన్నే రెవెన్యూ, జిడబ్ల్యూఎంసీ టైన్ ప్లానింగ్ అధికారులుచేరుకుని జేసీబీతో హద్దురాళ్లను తొలగించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ఖిలా వరంగల్/కాజీపేట: పలు రకాల కేసుల్లో సీజ్ చేసిన వాహనాలకు తక్కువ జరిమానాలతో విడిపించుకునే అవకాశం సీపీ అంబర్ కి శోర్‌ఝా కల్పించారు. 4 నుంచి 16 వరకు వరంగల్ జిల్లా సెకండ్ క్లాస్‌కోర్టులో జరుగుతున్న లోక్ అదాలత్‌కు సరైన ఆధారాలతో కోర్టుకు హాజరైతే సులభంగా వాహనాన్ని తీసుకెళ్లే అవకా శాన్ని పో లీసులు ఏర్పాటు చేశారు. పలు రకాల కేసులను క్లోజ్ చేసి సీజ్ చేసిన వాహనాలను వాహ నదా రులకు అప్పగించబడుతాయని మట్టెవాడ, కాజీ పేట సీఐలు శ్రీధర్, సుజాత పేర్కొన్నారు.

ఓటమి భయంతోనే తప్పుడు ఆరోపణలు

నయీంనగర్: ఓటమి భయంతోనే కాంగ్రెస్, బీజేపీలు ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్‌పై తప్పుడు ప్రచారం చేయిస్తున్నాయని బీఎస్పీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ మంద శ్యామ్ అన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ తప్పుడు ప్రచారం ఎవరు చేసినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం: పేకాట ఆడుతున్న శిబిరంపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడి చేసి పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. సుబేదారి పీఎస్ పరిధిలోని గాయత్రి కాలనీలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురి పేకాటరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 14,190 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వరంగల్ తూర్పు కోటలో..

ఖిలా వరంగల్: తూర్పుకోటలో ఓ ఇంటి పక్కన రహస్యంగా ఏర్పాటు చేసుకున్న పేకాట స్థావరంపై మంగళవారం మిల్స్‌కాలనీ పోలీసులు దాడులు చేశారు. రూ.1180 నగదు, 4సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పి. మల్లయ్య తెలిపారు.

ఆర్థికసాయం

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా పరకాలలో 15 ఏళ్లుగా ఈఎంటీగా ప్రజలకు సేవలందిస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్ ఆపరేషన్ అయి విశ్రాంతి తీసుకుంటున్న స్వప్నకు రూ.33,800ల ఆర్థికసాయాన్ని అందజేశారు. హనుమకొండ ప్రాజెక్టు మేనేజర్ శివకుమార్ పర్యవేక్షణలో ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు.

మోడల్ డివిజన్‌గా మారుస్తా

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 54వ డివిజన్ పోచమ్మకుంటను మోడల్ డివిజన్‌గా మారుస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోచమ్మకుంటలో పర్యటించి పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. డబ్బాల జంక్షన్ హనుమాన్ దేవాలయం ఎదుట అపూర్వ ఎంక్లేవ్ వద్ద రూ.20 లక్షలతో పైప్ లైన్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. మహిళా, వడ్డ సంఘాలకు, ఉప్పర కులసంఘాలకు కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటు చేస్తానన్నారు. కాలనీలో తిరుగుతూ రోడ్లు, డ్రెయిన్‌లను మున్సిపల్ డీఈ, ఏఈల తో కలిసి పరిశీలించి, ప్రజల నుంచి వినతులను తీసుకున్నారు. పోచమ్మకుంట శ్మశానవాటికను పరిశీలించి మోడల్ శ్మశాన వాటికగా మారుస్తానన్నారు. మోడల్ డివిజన్‌గా కావడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, గుంటి కుమార్, కూర సురేందర్, డివిజన్ నాయకులు కె.ప్రదీప్, గుంటి స్వప్న పాల్గొన్నారు.

ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి యాదవరెడ్డి

హన్మకొండ: ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధికారంలోకి రాగానే ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు మాట నిలుపుకోవాలని, ఉచితంగానే ఎల్‌ఆర్‌ఎస్ చేయాలని తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, కుడా మాజీ చైర్మన్ సంగం రెడ్డి సుందర్‌రాజు యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ కోసం మార్గదర్శకాలు రూపొందించినప్పుడు ప్రతిపక్షంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడారన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి ఎల్‌ఆర్‌ఎస్ లబ్ధిదారులు ఎలాంటి డబ్బులు చెల్లించొద్దని, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారందరికి ఎలాంటి రుసుము లేకుండా ఎల్‌ఆర్‌ఎస్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఈ నెల 6న ఉదయం 10 గంటలకు బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, కార్పొరేటర్ బొంగు అశోక్ యాదవ్, నాయకులు నార్లగిరి రమేష్, జోరిక రమేష్, మట్టపెల్లి రమేష్, జానకి రాములు, పరశురాం, మనోజ్, రఘు, పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సీఎండీకి డైరీ, క్యాలెండర్ అందజేస్తున్న నేతలు

హన్మకొండ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్పీడీసీఎల్ శాఖ అధ్యక్షుడు ఎ.ఆనందం, ప్రధాన కార్యదర్శి ఎస్.కుమారస్వామి కోరారు. మంగళవారం నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని తెలంగాణ స్టేట్ ఎస్సీ, ఎస్టీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కలిశారు. ఏపీకి చెందిన అధికారులు, ఉద్యోగులు ఎన్పీడీసీఎల్‌కు వచ్చిన క్రమంలో కొందరు ఇంజనీర్లు రివర్షన్‌కు గురయ్యారని, ఎస్సీ, ఎస్టీ అధికారులు తిరిగి ఏపీకి వెళ్లారని చెప్పారు. ఆ పోస్టుల్లో గతంలో రివర్షన్ పొందిన వారికి తిరిగి పదోన్నతులు కల్పించాలని, అన్‌మ్యాన్డ్ డిస్ట్రిబ్యూషన్ వర్కర్లను ఆర్టిజన్లుగా గుర్తించాలని సీఎండీకి విన్నవించారు. అదేవిధంగా పలు సమస్యలపై చర్చించినట్లు ఆనందం, కుమారస్వామి తెలిపారు. తమ సమస్యలపై సీఎండీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. అనంతరం అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించి సీఎండీకి అందించారు. అసోసియేషన్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మొగిలి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మధుకర్, రామచంద్రం, ఏడీఈ డి.మల్లేశం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆగయ్య, రమేశ్, గంగరాజు, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో సంస్థాగత నియామకాలు

హన్మకొండ: బీజేపీ హనుమకొండ జిల్లాలో సంస్థాగత నియామకాలు చేపట్టినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ తెలిపారు. పార్టీ అనుబంధ మోర్చాల అధ్యక్షులు, మండల, నగరంలోని డివిజన్‌లకు అధ్యక్షులను నియమించినట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు. యువమోర్చా జిల్లా అధ్యక్షుడిగా తీగల భరత్‌గౌడ్, మహిళమోర్చా అధ్యక్షురాలిగా లక్ష్మిరత్న, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జి.సారయ్య, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మార్త రాజభద్రయ్య, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా బెజ్జంకి పూర్ణాచారి, మైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా నవజ్యోత్‌సింగ్ బేడీని నియమించినట్లు తెలిపారు. పరకాల టౌన్ అధ్యక్షుడిగా మార్త బిక్షపతి, పరకాల రూరల్ అధ్యక్షుడిగా ముస్కే దేవేందర్, ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా బలవంతుల రాజు, దామెర జంగిలి నాగరాజు, నడికూడ రాజిరెడ్డి, శాయంపేట గడ్డం రమేష్, ధర్మసాగర్ చాట్ల రాజు, వేలేరు కట్ట్యాల రాజు యాదవ్, బీమదేవరపల్లి పైడిపల్లి పృథ్వీరాజు గౌడ్, ఎల్కతుర్తి కుడితి చిరంజీవి, కమలాపూర్ మండల అధ్యక్షుడిగా కటుకూరి అశోక్ రెడ్డిని నియమించినట్లు వివరించారు. అదేవిధంగా నగరంలోని డివిజన్లకు అధ్యక్షులను ప్రకటించారు. జిల్లా సురేష్ యాదవ్ (1వ డివిజన్), రుద్రారపు రాజు (2వ), గొర్రె ఓంప్రకాష్ (4వ), రాజ్‌కుమార్ (5వ), చింతల రఘుపతి (6వ), కల్లూరి కళ్యాణ్ (7వ), కస్తూరి నవీన్ (9వ), ఏడెల్లి ఎల్లా రెడ్డి (10వ), ఠాకూర్ అకాష్ సింగ్ (11వ), కేతుపల్లి సంపత్ రెడ్డి (30వ), కడవేరు శ్రీనివాస్ (31వ), దామెరుప్పుల రమేష్ (44వ), చెన్నబోయిన శ్రీకాంత్ (45వ), గంధసిరి శ్రీకాంత్ (47వ), మామిడి నరేందర్ (48వ), కుడికాల ప్రసాద్ (50వ), కోట దేవేందర్ రెడ్డి (51వ), ప్రవీణ్ (52వ), పెరుమాండ్ల రామకృష్ణ 53వ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. కురిమిండ్ల సది (54వ), మందోటి మహేందర్ పాటిల్ (56వ), మేదరబోయిన మధు (57వ), పి.రాం రెడ్డి (59వ), రోకుల సతీష్ (60వ), లావిడ్య రఘు నాయక్ (61వ), భగవాన్ ఉపాధ్యాయ (62వ), కళ్యాణ్ (63వ), నవీన్ (64వ), నాగవెల్లి రమేష్ (65వ), మారం తిరుపతి 66వ డివిజన్ అధ్యక్షునిగా నియమించినట్లు రావు పద్మ వివరించారు.

శివరాత్రి ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



కాజీపేట : ముస్తాబైన శివాలయం

కాజీపేట : పట్టణంలోని శివాలయాలు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. చౌరస్తాలోని శ్రీభ్రమరాంభిక మల్లికార్జునస్వామి, శ్వేతార్కగణపతి ఆలయంలోని శ్రీ సంతాన లింగేశ్వరస్వామి, సోమిడిలోని శివాలయం ముస్తాబయ్యాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అభివృద్ధి కమిటీలు ఏర్పాట్లు చేయడంలో నిమగ్నమయ్యాయి.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఖిలావరంగల్: వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రధాన పూజారి గంగు సతీష్‌శర్మ, ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొనసాగుతున్న శివరాత్రి మహోత్సవాలు

కాశిబుగ్గ : వరంగల్ కాశిబుగ్గలోని చారిత్రక శ్రీ కాశీవిశ్వేశ్వరాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం శ్రీ గణపతి సహిత రుద్ర చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే తమిళనాడు రాష్ట్రం కుంభకోణంలో తయారు చేయించి తీసుకొచ్చిన నూతన శివ పార్వతుల విగ్రహాలకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు గుండేటి కృష్ణమూర్తి, శ్రీరామల పెద్దన్న, కొమురయ్య, వైకుంఠం, ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్రనాథ్ శర్మ, రజనీకుమార్, పాల్గొన్నారు.

నేడు శివకల్యాణం

కాశీవిశ్వేశ్వరాలయంలో బుధవారం సాయంత్రం 6.10 గంటలకు అన్నపూర్ణ సహిత శ్రీ కాశీవిశ్వేశ్వరునికి శివకల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

శ్రీనివాస్‌కు రెండు ఉద్యోగాలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని విద్యా కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న రాచమల్ల శ్రీనివాస్‌కు రెండు ఉద్యోగాలు లభించాయి. మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో పీజీటీగా ఇటీవల ఉద్యోగానికి ఎంపికై ఉత్తర్వులు అందుకున్నాడు. అలాగే బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో మ్యాథమెటిక్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగానికి ఎంపికైన ఉత్తర్వులు అందుకున్నాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాలకు చెందిన శ్రీనివాస్ ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్, ఎంఈడీ, ఎంఏ సైకాలజీ పూర్తి చేశారు. నెట్, సెట్‌లోను అర్హత సాధించారు. శ్రీనివాస్ బీసీ వెల్ఫేర్ గురుకుల కళాశాలలో మ్యాథమెటిక్స్ జూనియర్ లెక్చరర్‌గా జాయిన్ అవుతానని మంగళవారం తెలిపారు.